సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



జరిమానా విధిస్తారా? మాఫీ చేస్తారా!

జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న ఎస్‌ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రహదారి నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ, మైనింగ్ అధికారులు కొండను తవ్వి గ్రావెల్‌ను తరలించారు. - IIలో



ఆస్తులు అటాచ్‌మెంట్ చేసినందుకే వేణుగోపాల్‌రెడ్డి హత్య

ప్రొద్దుటూరులో ఐదు రోజుల క్రితం జరిగిన ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసులో నింతులను పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.6 /25.4

జిల్లాలో బుధవారం 25.4 - 29.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.



ప్రొద్దుటూరు అమ్మవారిశాల ఆలయంలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శారదాదేవి అలంకారం

జగన్మాతా.. నమోస్తుతే!

దేవీ శరన్నవరాత్రుల వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. విద్యుద్దీప కాంతులతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ఆవరణలు కళకళలాడుతున్నాయి. బుధవారం ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల ఆలయంలో జగన్మాత శారదాదేవిగా దర్శనమిచ్చారు. జిల్లాలోని మిగతా ఆలయాల్లోనూ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కరుణించారు. - ప్రొద్దుటూరుకల్చరల్



కడప అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారం

పరిష్కారం దొరకదబ్బీ!

పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు మోక్షం ఎప్పుడు?

- పెండింగ్‌లో వేలాది అర్జీలు
- రెవెన్యూలోనే అత్యధికం
- ఫిర్యాదుల పరిష్కారంలో కనిపించని ఆడిట్
- పీపుల్స్ ఫ్రెండ్లీగా మార్చడమంటే ఇదేనా?

ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ వల్ల అర్జీదారులకు మేలు జరగడం లేదు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాక.. కలెక్టరేట్‌కు వస్తే అక్కడా 'ఫలితం' దక్కడం లేదు. 'నిర్ణీత గడువులోపు ..సమస్య పరిష్కారం' అనే మాట నేతల నోటి మాటలకు.. అధికారుల ప్రకటనలకే పరిమితమైంది. ఇంకే ముంది పరిష్కారానికి నోచుకోని అర్జీల సంఖ్య వారం వారం పెరుగుతూనే ఉంది.

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రీవెన్స్ సెల్ 'స్పందన' పేరు తొలగించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)గా మార్పు చేసింది. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ అర్జీల పరిష్కారంపై మాత్రం కనిపించడం లేదు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ఇప్పటివరకు మొత్తం 88 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 37,829 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 3996 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫిర్యాదుల్లో అత్యధికభాగం రెవెన్యూ, పోలీసు, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, పాఠశాల విద్య, ఎస్పీడీసీఎల్, హౌసింగ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రూరల్ డెవలప్‌మెంట్, పౌరసరఫరాలు, ఆర్అండ్‌బీ వంటి శాఖల నుంచి వస్తున్నాయి.

రెవెన్యూలో అత్యధికం

పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో రెవెన్యూశాఖ నుంచే అత్యధికంగా ఉన్నాయని, అందులో ఆర్వోఆర్‌కు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో స్వాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొనడం గమనార్హం. ఫిర్యాదుల పరిష్కారంలో ఆడిట్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పినప్పటికీ దాని ఫలితాలు ఎక్కడా కనిపించలేదు. రెవెన్యూశాఖను పీపుల్స్ ఫ్రెండ్లీగా మారుస్తామని ప్రకటనలు గుప్పించడం మినహా ఆచరణలో చేస్తున్నది మాత్రం శూన్యం. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారమే ఇందుకు నిదర్శనం. రెవెన్యూశాఖలో ఇప్పటివరకు మొత్తం 14,289 అర్జీలు వచ్చాయి. ఇందులో 2,196 పరిష్కారానికి నోచుకోలేదు. అలాగే సర్వే సెటిల్‌మెంట్ అండ్‌ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో 7170 అర్జీలు వచ్చాయి. పోలీసుశాఖకు సంబంధించి 7718 ఫిర్యాదులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 2210 అర్జీలు వచ్చాయి. ఇలా ఆయా శాఖల్లో పలు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రీ ఓపెన్ అవుతున్నవి కూడా అధికమే. కూటమి ప్రభుత్వం ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.





జేసీకి సమస్యను వివరిస్తున్న బాధితుడు (ఫైల్)

గత ప్రభుత్వంలో విశేష 'స్పందన'

కూటమి ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం కాగితాలకే పరిమితం అవుతోంది తప్ప క్షేత్ర స్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయి. పారదర్శకంగా విచారణ జరిపి సంతృప్తకర స్థాయిలో పరిష్కారాలు లభించలేదు. దీంతో వచ్చిన వారే మళ్లీమళ్లీ వస్తూ అర్జీలు సమర్పించుకోవాల్సి వస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్పందన పేరుతో అర్జీల స్వీకరణ, పరిష్కారం కూడా జరిగేది. ఈ కార్యక్రమానికి నాటి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలు సమర్పించే అర్జీలు మరింత నాణ్యంగా, వేగంగా పరిష్కారం కావాలన్న ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం'అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే పర్యవేక్షించిందంటే అర్జీల పరిష్కారానికి గత ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో అర్థమవుతుంది.

రోడ్డున పడ్డాం ఆదుకోండి

నా భర్త దస్తగిరి దువ్వూరులో గృహ నిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. ఆయన ఎలాంటి అక్రమాలకు పాల్పడకపోయినా ఉద్యోగంలో నుంచి తొలగించారు. తిరిగి ఉద్యోగం ఇవ్వాలంటూ అప్పటి పీడీ కృష్ణయ్యను కాళ్లావేళ్లా పడి వేడుకున్నాం. ఏ తప్పు చేయకపోయిన ఉద్యోగం నుంచి తొలగించడంతో నా భర్త మానసికంగా కుంగిపోయి చనిపోయారు. ఆ తర్వాత పీడీ కృష్ణయ్య బదిలీపై వెళ్లిపోయారు. మైదుకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద చిన్న అంగడి పెట్టుకుని జీవించేవాళ్లం. ఇప్పుడు టెండర్లు వేయడంతో అది కూడా లేకుండా పోయింది. నా కుమారునికి ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని అధికారులను పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. కలెక్టరేట్‌కు తిరిగినా అధికారుల మనస్సు కరగడం లేదు.

- లాల్ బీ, మైదుకూరు

ప్రణాళిక.. లేదు రబ్బీ

- మరో ఆరు రోజుల్లో ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభం
- ఇంతవరకు సాగు వివరాలు, ఎరువులు కేటాయించని ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపేనా!



పెద్దముడియం ప్రాంతంలో సాగు కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కడప అగ్రికల్చర్ : కూటమి ప్రభుత్వానికి రైతులంటే గిట్టదని.. వ్యవసాయమంటే చిన్నచూపని మరోసారి రుజువైంది. ఇప్పటికే పంటకు మద్దతు ధర దక్కక.. సాగుకు యూరిక దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. అవన్నీ దిగమింగుకుని రబీకి సిద్ధమవుతున్న రైతన్నకు .. ప్రభుత్వం నుంచి మద్దతు కరువైంది. సాగు వివరాలు.. ఎరువుల కేటాయింపు వంటి ప్రణాళిక సిద్ధం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మరో ఆరు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభంకానుంది. వ్యవసాయశాఖ ఇంత వరకు రబీ సీజన్‌కు సంబంధించిన సాగు ప్లానింగ్ సిద్ధం చేయలేదు. విత్తనాలను కేటాయించినా వాటి సబ్సిడీ, విత్తనాల ధరలను ఇంతవరకు పేర్కొనలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో కురుస్తున్న వర్షాలు...

జిల్లాలో వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకే రబీ సీజన్‌కు సంబంధించి కొంతమంది రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంది. ఆరుతడి పంటలసాగుకు ముందు చాలా మంది రైతులు సత్తువ పంట వేస్తారు. కానీ జిల్లాలో ఎరువులు సరిగా దొరకడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ముఖ్యంగా రబీలో అధిక విస్తీర్ణంలో జిల్లాలో శనగపంట సాగవుతుంది. దీంతోపాటు వేరుశనగ, మినుము, పెసర, నువ్వు వంటి పంటలను కూడా అధిక విస్తీర్ణంలోనే సాగు చేస్తారు. ముఖ్యంగా రబీ సీజన్ ప్రారంభంలో జిల్లా రైతులు శనగ సాగు చేస్తారు. ప్రభుత్వం ఇంతవరకు శనగ విత్తనాలకు సంబంధించిన ధరలను కానీ, ఎంత శాతం మేర సబ్సిడీ అనే విషయాలను కేటాయించలేదు. మరి విత్తనాల కోసం ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, అధికారులు విత్తనాలను ఎప్పుడు రైతు సేవా కేంద్రాలకు పంపిస్తారని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. హడావుడిగా విత్తనాల పంపిణీ చేపడితే ఆ విత్తనాలు ఎలాగుంటాయోనని రైతుల్లో ఆందోళన మొదలైంది. గతేడాది చాలా మేర శనగ విత్తనాలు సరిగా లేవని రైతులు పెదవి విరిచారు.

212.3 మి.మీ వర్షపాతం...

రబీ సాగుకు అక్టోబర్ కీలకం. రబీ మూడు నెలలకాలంలో 212.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా అందులో అక్టోబర్ నెలలో అత్యధికంగా 132.1 మిల్లీమీటర్లు కురవాలి. ఇక నవంబర్ నెలలో 61.6 మి.మీ, డిసెంబర్ నెలలో 18.6 మి.మీ కురవాల్సి ఉంది. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు శనగపంట సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి అక్టోబర్ తొలి వారంలోనే ముందస్తుగా శనగపంటను విత్తుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ సారి ఖరీఫ్‌సాగు చేయలేని రైతులు రబీలో శనగ సాగు చేయనున్నారు. కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అక్టోబర్‌లోనే అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యేవి. ఆ నెల తొలి వారంలోనే 40 శాతం సబ్సిడీతో శనగవిత్తనాలు అందే విషయాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు. విత్తనాల పంపిణీని త్వరితగతిన ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శనగ విత్తనాలను ఎప్పుడిస్తారో...



ప్రస్తుతం జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. ఈ పదునుకు మేమంతా ఎరువులను విత్తుకుంటాం. అక్టోబర్ 2 లేదా మూడవ వారం నుంచి శనగ పంటను సాగుచేస్తాం. నేను కూడా 12 ఎకరాల్లో శనగపంటను సాగు చేయనున్నా. ప్రభుత్వం ఇంతవరకు సబ్సిడీ, విత్తనాలను గురించే మాట్లాడటం లేదు. మరి సబ్సిడీ శనగ విత్తనాలను ఎప్పుడి నుంచి ఇస్తారో.

- శెట్టిపల్లి పవన్‌కుమార్‌రెడ్డి, పెద్దపసుపుల, పెద్దముడియం మండలం.

నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి



ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే విత్తనాలను నాణ్యతతో కూడినవి ఇవ్వాలి. గతేడాది రైతులకు ఇచ్చిన శనగ విత్తనాల్లో అక్కడక్కడ నాణ్యత సరిగా లేదు. దీంతో చాలా మంది రైతులు బయట నుంచి కొనుగోలు చేసి విత్తుకున్నారు. ఈ ఏడాది అలా జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఇరగంరెడ్డి చిన్న గంగిరెడ్డి, సోమపురం, రాజుపాలెం మండలం

రైతులకు ఆందోళన అవసరం లేదు



జిల్లాకు సబ్సిడీకి సంబంధించి శనగ, వేరుశనగ, నువ్వులు, మినుములు, పెసల విత్తనాలైతే వచ్చాయి. కానీ వాటి ధరలుకానీ, ఎంత సబ్సిడీ అనే విషయాలపై స్పష్టత లేదు. దీంతోపాటు రబీ సాగు ప్లానింగ్, ఎరువులు కూడా రాలేదు. త్వరలో అవికూడా వస్తాయి. రైతులు ఎవరు ఆందోళన చెందనవరం లేదు.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్‌రీల్

27న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27వ తేదీ ఎస్‌జీఎఫ్ అండ్-19 బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 ఎంపికల ఇన్‌చార్జులు శారద, జిలానీ బాషా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99855 39525, 94401 07080 అనే నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా పశువైద్యాధికారి బదిలీ

కడప అగ్రికల్చర్ : జిల్లా పశువైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ శారదమ్మ బదిలీ అయ్యారు. పులివెందుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యాధికారిగా వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు జిల్లా పశువైద్యాధికారిగా నియమితులయ్యారు.

ఆకాంక్ష జిల్లాల లక్ష్యసాధనకు కృషి

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లాలో వైఎస్సార్ జిల్లా ఒకటన్నారు. జిల్లా సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. అలాగే ఆయా ప్రామాణికాల్లో జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లి జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

'దేశం'లో.. విద్వేష మంటలు!

- తెలుగుదేశంలో ముదిరిన వర్గ విభేదాలు
- పాతకడప కృష్ణారెడ్డి గ్రావెల్ క్వారీలో జేసీబీ ధ్వంసం
- ఎమ్మెల్యే వర్గీయులు దాడి చేసినట్లు ఫిర్యాదు
- దుశ్చర్యలను సహించమంటున్న అసమ్మతి వర్గీయులు

సాక్షి ప్రతినిధి, కడప : తెలుగుదేశం పార్టీలో ముదిరిన వర్గ విభేదాల కారణంగా కడప గడపలో ఉద్రిక్తత పెరిగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ప్రశాంత కడపలో ఏదొక రచ్చ జరుగుతూనే ఉంది. తాజాగా పచ్చ పార్టీలో వర్గ పోరు వీటికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే మాధవి రెడ్డి వైఖరిపై పాతకడప సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి నేతృత్వంలో ఓ వర్గం నిరశన చేపట్టిన విషయం తెలిసిందే. ఆపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి వద్దకు వెళ్లి కార్యకర్తలకు రక్షణగా నిలవాలంటూ అభ్యర్థించారు. ఇదంతా జరిగి మూడు రోజులైన గడవకముందే కృష్ణారెడ్డి లీజుకు తీసుకున్న ఓ గ్రావెల్ క్వారీలో ఉన్న జేసీబీని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మాధవి వర్గీయులు ధ్వంసం చేయడం వర్గపోరులో మరింత మంట రాజేసింది.

కడప నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి విశేషంగా పనిచేసిన నేతలంతా క్రమేపీ అసంతృప్తి వాదులుగా మారారు. అందులో కొందరు మౌనం దాల్చితే.. మరికొందరు బాహాటంగా అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఈక్రమంలో అధిష్టానానికి ఫిర్యాదు చేశారనే నెపంతో నగర కమిటీ మాజీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే తనపై హత్యాయత్నం చోటు చేసుకున్నట్లు ఆ తర్వాత శివకొండారెడ్డి బహిర్గతం చేశారు. తాజాగా గత సోమవారం పాతకడప కృష్ణారెడ్డి దేవునికడపలో నిరశన చేపట్టి ఆ తర్వాత మాచిరెడ్డిపల్లెలో ఉన్న పుత్తా నరసింహారెడ్డిని కలిశారు. కడపలో టీడీపీ కార్యకర్తలకు రక్షణగా నిలవాలంటూ కోరారు. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి కృష్ణారెడ్డి లీజుకు తీసుకున్న ఓ గ్రావెల్ క్వారీలో ఉన్న జేసీబీని ధ్వంసం చేయడం గమనార్హం.

అక్రమ క్వారీ నిర్వాహకులచే...

కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి వర్గీయులు అక్రమ క్వారీ నిర్వహిస్తూ గ్రావెల్ ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు. అధికారికంగా ఐదు క్వారీలు ఉండగా వాటికీ రాయల్టీ ఇవ్వకుండా మైనింగ్ అధికారులు శల్యసారథ్యం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన నేతలు పరపతి ఆధారంగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. కడప ఎమ్మెల్యే వర్గీయులు కూడా అందులో తలమునకలయ్యారు. ఈ క్రమంలో పాతకడప కృష్ణారెడ్డి మరికొందరు కలిసి ప్రభుత్వ లీజు క్వారీని చేజిక్కించుకొని గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే వర్గీయులైన అక్రమ క్వారీ నిర్వాహకులు జేసీబీని ధ్వంసం చేసినట్లు సమాచారం. అదే విషయాన్ని టీడీపీ అసమ్మతి నేతలు సైతం స్పష్టం చేస్తున్నారు. అరాచకాలను సహించేది లేదని, ఇకనైనా ఇలాంటి దుర్మార్గపు చర్యలు వీడాలంటూ పలువురు టీడీపీ నేతలు హితవు పలుకుతున్నారు. కాగా, జేసీబీ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పొద్దు పోయేంతవరకూ అటువైపు కన్నెత్తి చూడలేదని తెలుస్తోంది.









తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన నాయకులు ఎస్వీ సతీష్ రెడ్డి, అంజద్‌బాషా, సురేష్‌బాబు, దాసరి సుధ, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, తదితరులు

రైతన్న గోడును పట్టించుకోని ప్రభుత్వం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతన్నల గోడు పట్టించుకునే పరిస్థితిలో లేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల బాగోగులను ఏమాత్రం పట్టించుకోరని ధ్వజమెత్తారు. ఆయన ఆలోచనంతా ప్రైవేట్ సంస్థలకు, వ్యక్తులకు పెద్ద పీట వేయడం గురించే ఉంటుందని ఆరోపించారు. తన అనుచరులకు దోచిపెట్టేందుకే ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. కానీ అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఆ తీర్మాణానికి ఎందుకు మద్దతు తెలపలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని లక్ష కోట్ల మెడికల్ కళాశాలల ఆస్తిని చంద్రబాబు ప్రైవేట్‌పరం చేయడానికి పూనుకున్నాడన్నాని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అంటూ డబ్బా కొట్టుకుని అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. మరోవైపు రైతన్నల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదన్నారు. మరోవైపు రైతులకు పండించుకోవడానికి ఎరువులు, యూరియాను సైతం ఈ ప్రభుత్వం అందజేయడంలేదన్నారు. రాష్ట్రంలో ఇంత దారుణమైన పరిస్థితులు ఉంటే ఎల్లో మీడియా ద్వారా ఏదో సాధించినట్లుగా దుష్ప్రచారం చేసుకోవడం విడ్డూరమన్నారు. అనంతరం ఎంపీ ప్రజా దర్బార్ నిర్వహించారు.

అమరావతికి డీఎస్సీ అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 869 అభ్యర్థులు కాగా వారి కుటుంబ సభ్యులతో కలిసి మొత్తం 1666 మంది బయలుదేరి వెళ్లారు. వారి కోసం 43 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. 122 సిబ్బందితోపాటు 15 మంది పోలీసుల భద్రతతో కలెక్టరేట్ ప్రాంగణం నుంచి బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్సీ అభ్యర్థులకు గురువారం నియామక పత్రాలు అందజేయనున్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా డీఈఓలు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యం, సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్లకు దసరా సెలవులు ఇవ్వాలి



ఆర్జేడీ కార్యాలయం ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వం అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించినప్పటికి ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం నగరంలోని ఆర్జేడీ కార్యాలయం ఏఓ విజయ్‌కుమార్‌కు డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు దసరా సెలవుల్లో స్కూలుకు రాకుంటే ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం చెల్లింపుపై సమీక్ష



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని సూచనల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో బుధవారం న్యాయసేవా సదన్‌లో 'హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం చెల్లింపు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డివిజన్ అడిషనల్ ఎస్పీ, కడప డీఎస్పీ, కడప, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ సైన్సు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 'కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్' లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్, కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి తెలిపారు. డీడీటీ. ప్లుట్యు్ం ్చి. జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 30 వరకు గడువు ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆస్తులు అటాచ్‌మెంట్ చేసినందుకే వేణుగోపాల్‌రెడ్డి హత్య

- ఫైనాన్షియర్ హత్య కేసులో ఆరుగురు నిందితుల అరెస్టు
- ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి సహా..
- నలుగురు తెలంగాణా రాష్ట్రానికి చెందిన కిరాయి హంతకులు
- అరెస్టు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఐదు రోజుల క్రితం జరిగిన ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసులో నింతులను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడు తమ ఆస్తులను కోర్టులో అటాచ్‌మెంట్ చేశాడనే కోపంతో ఈ హత్య చేసినట్లు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన ఇరువురితో పాటు తెలంగాణా రాష్ట్రానికి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరులోని ఎస్‌డీపీఓ కార్యాలయంలో డీఎస్పీ భావనతో కలసి జిల్లా ఎస్పీ అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రొద్దుటూరులోని బొల్లవరం ప్లాట్లలో నివాసం ఉంటున్న కొండా వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 19న రాత్రి కిడ్నాప్‌నకు గురయ్యాడనే సమాచారం రావడంతో రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ అరుణ్‌రెడ్డి వేగంగా స్పందించారు. కిడ్నాప్ అయిన వ్యక్తిని ప్రాణాలతో కాపాడాలనే ఉద్దేశంతో డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, కేసీ రాజు, రాజుపాలెం ఎస్ఐ వెంకటరమణలతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఈ కేసులోని అనుమానితులను గుర్తించి వారి ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేక్ అవుట్స్ ద్వారా నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే ఈ నెల 21న చాపాడు సమీపంలోని కుందూ వంతెన వద్ద వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు తెలంగాణా రాష్ట్రానికి చెందిన నలుగురు కిరాయి హంతకులతో వేణుగోపాల్‌రెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఆస్తుల అటాచ్‌మెంట్ ఆర్డర్ పొందడంతోనే..

మృతుడు వేణుగోపాల్‌రెడ్డి 30 ఏళ్లుగా వడ్డీ వ్యాపారం, రియల్ ఎస్టేట్ చేసేవాడు. ప్రొద్దుటూరులో చాలా మందికి వడ్డీకి అప్పులిచ్చాడు. సకాలంలో చెల్లించని వారిపై కోర్టులో సివిల్ దావాలు వేసి వసూలు చేసుకునేవాడు. డబ్బులు కట్టలేని వారి ఆస్తులు అటాచ్‌మెంట్ కోరేవాడు. ప్రొద్దుటూరుకు చెందిన వెన్నెపూస లక్ష్మిరెడ్డి, ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డిలు కూడా వేణుగోపాల్‌రెడ్డి వద్ద పెద్ద మొత్తంలో వడ్డీకి తీసుకున్నారు. డబ్బు ఇవ్వడంలో ఆలస్యం కావడంతో అతను వారిద్దరి ఇళ్లపై అటాచ్‌మెంట్ ఆర్డర్‌ను కోర్టు ద్వారా పొందాడు. దీంతో కోపంతో రగిలిపోయిన వాళ్లిద్దరూ వేణుగోపాల్‌రెడ్డిపై కక్ష పెంచుకొని ఎలాగైనా అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. కాగా 2016లో బాకీ డబ్బు విషయమై జరిగిన గొడవలో కొండా వేణుగోపాల్‌రెడ్డిపై లక్ష్మిరెడ్డి కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదైంది.

హైదరాబాద్‌లో హత్యకు వ్యూహ రచన..

వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డిలు రియల్ ఎస్టేట్ చేస్తూ హైదరాబాద్‌లోని పఠాన్ చెరువు ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. వారి వద్ద అసిస్టెంట్‌గా పని చేస్తున్న బోయిని నగేష్‌తో వేణుగోపాల్‌రెడ్డి హత్య గురించి చర్చించారు. అతను హత్య చేయడానికి అంగీకరించడంతో ఖర్చుల కోసం అతనికి పలు దఫాలుగా రూ. 70 వేలు ఇవ్వడంతో పాటు జీవనోపాధికోసం ఏదైనా వ్యాపారం పెట్టిస్తామని చెప్పారు. దీంతో నగేష్ తన మిత్రుల ద్వారా ఫైనాన్షియర్‌ను హత్య చేయడానికి ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులను హైదరాబాద్ నుంచి లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు నాలుగు సార్లు ప్రొద్దుటూరుకు తీసుకొచ్చి వేణుగోపాల్‌రెడ్డిని చంపడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు ఈ నెల 19న వేణుగోపాల్‌రెడ్డిని చంపేసి మృతదేహాన్ని కామనూరు బ్రిడ్జిపై నుంచి కుందు నదిలో పడేశారు. దర్యాప్తులో భాగంగా కేసులోని నిందితులు ప్రొద్దుటూరుకు చెందిన వెన్నపూస లక్ష్మిరెడ్డి, ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డి, తెలంగాణా రాష్ట్రంలోని మెదక్ జిల్లాకు చెందిన బోయిని నాగేష్ అలియాస్ హర్ష, లైని అజయ్‌కుమార్, హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లాకు చెందిన చింతలచెరువు ప్రణయ్ కుమార్, మియాపూర్‌కు చెందిన కొత్త శివ ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మారుతి వేగనార్ కారు, హోండా యాక్టివా స్కూటీ, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులోని నిందితుడు బోయిని నగేష్‌పై 2022లో మెదక్ జిల్లా అల్లదుర్గ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసు నమోదైంది.

రూరల్ పోలీస్ బృందానికి ఎస్పీ ప్రశంస

వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసును త్వరిత గతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన ప్రొద్దుటూరు డీఎస్పీ, ప్రొద్దుటూరు రూరల్ పోలీసు బృందాన్ని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు. బృందంలోని రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, కేసీ రాజు, రాజుపాళెం ఎస్ఐ కె వెంకటరమణ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఎవరైనా అధిక వడ్డీలకు డబ్బులిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, కార్మికులకు రూ.18,600 వేతనం చెల్లించే విషయంలో స్పందించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, బద్వేలు, కడప, జీజీహెచ్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 11 వేల నుంచి రూ. 12వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీకి విన్నవించామన్నారు. ఆయన ముఖ్యమంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కాంట్రాక్టర్‌లో చలనం వచ్చిందన్నారు. ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు పవన్, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శివరామ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి లోకేష్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహనం కోల్పోయి మాట్లాడిన తీరు అభ్యంతరకరమన్నారు. మంత్రి లోకేష్ తన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలోనూ బాపట్ల ఎమ్మెల్యే వేగసేన నరేంద్ర వర్మ చేసిన వ్యాఖ్యలు ఓ సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె. శివ యాదవ్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్. బాదుల్లా, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి నరసయ్య, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి క్రిష్ణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బోధనలో కృత్రిమ మేధను ఉపయోగించాలి



మాట్లాడుతున్న వైవీయూ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : కృత్రిమ మేధను బోధన, పరిశోధనలో వినియోగిస్తే విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు సృష్టిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి ఉషా విభాగం ఆధ్వర్యంలో 'క్రియాశీల బోధన కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) సాధనాలు, సాంకేతిక పద్ధతులు' అనే అంశంపై జాతీయ స్థాయి ఒకరోజు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి మాట్లాడుతూ సాంకేతిక విధానాలు విద్యార్థులు, అధ్యాపకులకు జ్ఞానం పెంపొందించడానికి సహాయపడతాయన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పుత్తా పద్మ మాట్లాడుతూ కోవిడ్–19 మహమ్మారి కాలం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలు అలవాటు అయ్యాయన్నారు. వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ జి.వి. రమేశ్ బాబు, పీఎం ఉష ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ టి. చంద్రశేఖర్ మాట్లాడారు. డాక్టర్ ఎస్. సునీత, డాక్టర్ కె. లలిత, డాక్టర్ పి. సరిత తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని బాలిక మృతి



మృతి చెందిన బాలిక దర్శిని

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలోని దళితవాడ వద్ద రోడ్డుపైకి ఆడుకునేందుకు వచ్చిన బాలిక గొల్లపల్లె దర్శిని(6)ని కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలిక కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రహ్మంగారిమఠం మండలం నందిపల్లెకు చెందిన రాజు తన భార్య, కూతురుతో కలసి మండలంలోని చిన్నగురువళూరులోని తన బంధువుల ఇంట్లో బుధవారం జరిగిన వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో బాలిక దర్శిని రోడ్డుపైన ఆడుకుంటుండగా దీనిని గమనించని డ్రైవర్ కారును రివర్స్ చేసుకుంటుండగా ప్రమాదశాత్తు బాలికను ఢీ కొంది. ఆరేళ్ల చిన్నారి కారు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య



నసీంఖాన్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయిపేటలో నివాసముంటున్న పఠాన్ నసీం ఖాన్ (42) మానసిక ఆవేదనతో, ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతురాలికి గతంలో ఓ వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరిలో ఒక కుమార్తెకు వివాహం కూడా చేసింది. గత 8 సంవత్సరాల క్రితం ఆరిపుల్లా ఖాన్ తో రెండవ వివాహం జరిగింది. అప్పటినుంచి ఆరిపుల్లాఖాన్ కువైట్‌కు వెళ్లి వస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో మృతురాలికి డబ్బులు పంపకపోవడం, అనుమానంగా ప్రవర్తించడంతో మానసిక వేదనకు గురైంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు కూడా తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

రేషన్‌కార్డుదారులకు జీఎస్టీని మినహాయించాలి



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ కొన్ని వస్తువులకే అమలవుతోందని అందువల్ల రేషన్‌కార్డు ఉన్నపేదలకు జీఎస్టీని మినహాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. బుధవారం ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తుండటంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారిని ఆదుకోవడానికి ఆటో డ్రైవర్లకు రోజుకు 5 లీటర్ల ఇంధనాన్ని 50 శాతం సబ్సిడీతో అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ప్రభుత్వం చట్టభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానియల్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు బాల లక్ష్మయ్యమాదిగ, కర్ణమాదిగ, డప్పు చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు శివమణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

మైదుకూరు : నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్ హెచ్చరించారు. బుధవారం ఆయన మైదుకూరులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు ఎరువులను కొనుగోలు చేశాక తప్పనిసరిగా వారికి బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ బాల గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

మండలంలోని శివపురం, డయాంఖాన్ పల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బాల గంగాధర్ రెడ్డి రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సూచించారు. ఈనెల 30వ తేదీ లోపు పంట నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎయిడెడ్ పోస్టుల అక్రమాల సూత్రధారి ఆర్‌జేడీ శామ్యూల్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన ప్రజా సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టుల్లో జరిగిన భారీ అక్రమాలకు ప్రధాన సూత్రధారి ఆర్‌జేడీ శామ్యూల్‌ను ప్రభుత్వం వెంటనే సరెండర్ చేసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన ప్రజా సంఘాల జేఏసీ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. జేఏసీ చైర్మన్ ఆర్ఎస్ రాజు, వైస్ చైర్మన్ అంకన్న తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు. మూసివేసిన పాఠశాలల్లో సైతం ఉపాధ్యాయ పోస్టులు సృష్టించారని ఆరోపించారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తన రాజకీయ బలంతో విధులకు హాజరు కాకుండా ఆర్‌సీఎం యాజమాన్యంతో కుమ్మక్కయ్యారన్నారు. జాయినింగ్ ఆర్డర్స్ తారుమారు చేసిన జాన్సన్ చెట్టురిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జయవర్ధన్, సుబ్బరాయుడు, శివకుమార్, డీఎం ఓబులేశు యాదవ్, కత్తి ఓబులేశు, సగిలి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులా దూసుకొచ్చిన లారీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- గువ్వలచెరువు ఘాట్‌లో దుర్ఘటన



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతి చెందిన లక్షుమయ్య

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ జాతీయ రహదారిపై రాయచోటి వైపు నుంచి అతివేగంతో దూసుకొచ్చిన లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవహనాన్ని ఢీకొనడంతో కొప్పల లక్షుమయ్య (60) మృతి చెందాడు. కొప్పల. ఈశ్వరయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం రాయచోటి వైపు నుంచి ఎలక్ట్రికల్ పరికరాలతో కూడిన గూడ్స్ లారీ వేగంగా రావడంతో నాలుగో మలుపు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద లారీని డ్రైవర్ అదుపుచేయలేక లారీ డ్రైవర్ కిందికి దూకేశాడు. ఆ సమయంలో రోడ్డుకు అవతలవైపున ఎదురుగా గువ్వలచెరువు వెపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ఈశ్వరయ్య గమనించి ద్విచక్రవాహనాన్ని ఆపే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కొప్పల లక్షుమయ్యను లోయవైపు ఈడ్చుకుపోగా కుడి కాలు, కుడి చేయి తెగిపడి, సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్రవాహనంలోని మరో వ్యక్తి కొప్పల ఈశ్వరయ్యకు గాయలయ్యాయి. లారీ డ్రైవర్ లారీ లోయ వైపు దూసుకెళ్లే క్రమంలో లారీ నుండి ముందే దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడినవారిని పోలీసులు 108 వాహనాల ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదంలో మృతిచెందిన లక్షమయ్య, గాయపడిన ఈశ్వరయ్య సమీప బంధువులే. వీరిది లక్కిరెడ్డిపల్లె మండలంలోని దప్పేపల్లె రామాపురం గ్రామం. కడపలో ఉన్న తమ సమీప బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం బారిన పడ్డారు. మృతుని బంధువులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని తీవ్రంగా విలపించారు. సంఘటన స్థలాన్ని చింతకొమ్మదిన్నె సీఐ బాల మద్దిలేటి, సిబ్బంది పరిశీలించారు.

ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'



వాహనాల తనిఖీతో పాటు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

- అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు.
- ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.
- రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు.
- సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు.
- విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు.

జరిమానా విధిస్తారా? మాఫీ చేస్తారా!

- ఎస్ఆర్‌సీ అక్రమ తవ్వకాలపై మీనమేషాలు లెక్కిస్తున్న మైనింగ్‌శాఖ



కొండను తవ్వి గ్రావెల్ తీసుకెళ్లిన ప్రాంతంలో కొలతలు వేస్తున్న మైనింగ్ సిబ్బంది

జమ్మలమడుగు : జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రహదారి నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండానే భారీగా కొండను తవ్వి గ్రావెల్‌ను తరలించారు. ఈ విషయం సాక్షి దినపత్రికలో రావడంతో మైనింగ్‌శాఖ అధికారుల్లో కాస్త చలనం వచ్చింది. ఈనెల 10 వతేదీ జమ్మలమడుగు–ముద్దనూరు రహదారి అంబవరం పంచాయతీ పరిధిలో అక్రమంగా కొండను తవ్వి గ్రావెల్‌ను ఎత్తుకు వెళ్లిన ప్రాంతాన్ని అధికారులు సందర్శించారు. అనంతరం అక్రమంగా ఎంత మైనింగ్ చేశారో కొలతలు తీసుకున్నారు. వచ్చిన అధికారులు అక్రమ మైనింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఆ తర్వాత వారు చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధిస్తారని చెప్పి వెళ్లిపోయారు.

22 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం..

నంద్యాల–జమ్మలమడుగు 167వ జాతీయ రహదారి నిర్మాణం కోసం టెండర్ 80 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. అందులో జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో 22 కిలోమీటర్ల మేర పనులు చేయడంతోపాటు, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ పనులను దక్కించుకున్న ఎస్ఆర్‌సీ కంపెనీ గత మూడు నెలలుగా పనులు ప్రారంభించింది. రోడ్డు పనుల కోసం కావలసిన గ్రావెల్ కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఇప్పటికే దాదాపు సగానికి పైగా పనులు పూర్తి చేశారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు తెలుపుతున్నారు. రహదారి నిర్మాణం కోసం కావలసిన గ్రావెల్‌ను కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా మొత్తం కొండను తవ్వి రహదారి నిర్మాణం చేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజుకు రెండు వందల టిప్పర్ల వంతున అక్రమంగా గ్రావెల్‌ను తీసుకు వెళ్లారు. ఇదంతా

స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులకు తెలిసినా అటువైపు తొంగి చూడని పరిస్థితి ఉంది. అధికారులు దాడులు చేసి అక్రమంగా తవ్విన గ్రావెల్ కొలతలు తీసుకుపోయిన మరుసటిరోజు నుంచే తిరిగి యథావిధిగా అక్రమ మైనింగ్ చేసి టిప్పర్‌లలో గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

చర్యలు తీసుకుంటారా.. ఉసూరు మంటారా!

ఎస్ఆర్‌సీ కంపెనీ అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆపై ఎంత మైనింగ్ ద్వారా గ్రావెల్ తరలించారో కొలతలు తీసుకున్నారు. స్థానికంగా రెవెన్యూ అధికారులు ఎవ్వరూ సహకరించకపోయినా వారే కొలతలు వేసుకుని పోయారు. ప్రస్తుతం 15 రోజులకు పైగా అవుతున్న ఎస్ఆర్‌సీ కంపెనీపై ఎలాంటి చర్యలకు సిఫారసుగాని, అక్రమ మైనింగ్ చేసి గ్రావెల్‌ను తరలించినందుకు జరిమానాలు కానీ విధించలేదు. భారీ స్థాయిలో అక్రమంగా గ్రావెల్‌ను తరలించినా ఉన్నతాధికారులు ఏమాత్రం స్పందించకపోవడం కేవలం వచ్చాము.. పోయాము అన్న చందంగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.